అ తి బా ల్య వి వా హ ము

ఓవిద్వన్మహాజనులారా!

ఈసమాజముయొక్క అగ్రాసనాధిపతిగారు కొన్నిదినముల క్రిందట నన్నొకయుపన్యాసము చదువు మని యడిగినప్పుడు నాశక్తిని వక్తవ్యాంశముయొక్క గౌరవమును లేశమాత్రమును విచారింపక సాహసము చేసి బాల్యవివాహమునుగూర్చి యుపన్యసించుట కొప్పుకొన్నాఁడను. కాని యీదినమున నేను కలము చేతఁబట్టుకొని వ్రాయ నారంభింపఁగానే, నాకంటె సమర్థతరులకు విడిచిపెట్టవలసినకార్యభారమును, నేను పైని వేసికొన్నహేతువుచేతఁగాఁబోలును కలము సాగక నాచేయి నడఁక మొదలు పెట్టెను. నాకంటె విద్యయందును బుద్ధియందును అధికులయిన యీసామాజికులలో మఱియెవ్వరయిన సమర్థులీబాల్యవివాహమునుగూర్చి వ్రాసినచో మిక్కిలి రసవంతముగాను జనరంజకముగాను ఉండునని నే నెఱిఁగినవాఁడ నయ్యును, రోటిలో తల దూర్చినతరువాత రోకటిపోటునకు వెఱవఁదగ దన్నసామెతను స్మరించుకొని నాకు తోఁచినది వ్రాయ తెగించుచున్నాను. కాఁబట్టి నే నిప్పుడు చెప్పఁబోవుదానిలో మీ రెఱుఁగని క్రొత్తసంగతులుగాని క్రొత్తయుక్తులుగానియుండునని యాశపెట్టుకొనఁ బోకుఁడు. లోకములోననుభవింపఁదగిన సమస్తసుఖములలోను వివాహబంధమువలననే భార్య, భర్త, తండ్రి, బిడ్డ, అక్క, చెల్లెలు, అన్న, తమ్ముఁడు, మొదలయినసమస్తబంధుత్వములునుకలుగుననియు, ఈవివాహబంధమువలననే బిడ్డలుమృగప్రాయులుగాక తగినసంరక్షణమును విద్యాబుద్ధులను పొంది వెలయుదు రనియు, ఈవివాహబంధమువలననే స్త్రీపురుషులు యావజ్జీవమును స్నేహపాశాబద్ధులయి యుండి యిరువురునొక్క

దేహముగా పరిగణింపఁ బడుచుందు రనియు, ఈవివాహబంధమువల
ననే పురుషుల యావశ్యకములను స్త్రీలును, స్త్రీలయావశ్యకములను
పురుషులును తీర్చి పరస్పరసుఖాభివృద్ధి పొందుదు రనియు, మీ రం
దఱు నెఱిఁగియున్నవిషయమే గనుక వివాహముయొక్క ప్రాశస్త్య
మును గుఱించియు ప్రయోజనములను గుఱించియు నే నిక్కడ చెప్ప
వలసిన యావశ్యకము లేదు. అనురాగము వధూవరులకుఁ గలుగ
వలసినసుఖమునకుఁ గాని దుఃఖమునకుఁ గాని వధూవరులయోగ్యతా
యోగ్యతలే ప్రధానములై నవనియు, సంసారసుఖము దంపతులయొక్క
పరస్పరానురాగము ననుసరించియే యుండు ననియు, మీకు విశదప
డినయంశమే గనుక వివాహకాలమునకు ముందే వధూవరులు వివా
హబంధమువలనఁ దమకు ముందు కలుగఁబోయెడు సంసారభారము
యొక్క గౌరవమును తాము ముందెల్లకాలమును కలసిమెలసి యుండ
వలసినవారిగుణాగుణములను తెలిసికొను తగినంతప్రాజ్ఞత గలవారుగా
నుండవలసిన దన్నయంశమునుసహితము నేను వివరింపవలసిన యావ
శ్యకము లేదు. అయినను వివాహము లెవ్వరి సుఖసంతోషాదులనిమిత్త
ముద్దేశింపఁబడినవో, వానియందలి లోపమువలన నెవ్వరు కలకాల
మును దుఃఖ మనుభవింపవలసినవా రగుదురో, తమచిరకాల సుఖజీవ
నమున కనుకూలప్రతికూలములుగా నుండుసాధకబాధకముల నాలో
చించుకొనుట కెవ్వ రర్హులో, వారియంగీకారమును పరస్ప రేచ్ఛను
లేశమాత్రమును గణింపక మనదేశమునందు కొన్నివర్ణములవారు
వివాహములయం దాస్వాతంత్ర్యము నంతను తామే యక్రమముగా
వహించి యాచారబలము చేతను మఱికొన్ని కారణములచేతను
యుక్తాయుక్తవిచారమును జేయజాలక నిర్దోషు లయినబిడ్డలకు మితి
మీఱినకష్టములను తెచ్చి పెట్టుచుండుట చూడ నెంతయు శోచనీయము
గానున్నది. సంసారసుఖకల్పవృక్షమును మూలచ్ఛేదము చేయుటకై

వేరుపురుగువలెనున్న యీబాల్యవివాహమును రూపుమాపినంగాని మన దేశమునందలి కుటుంబములలో వివాహమువలని సంపూర్ణ ఫల మెన్నటికిని కలుగనేరదు. ఈబాల్యవివాహము మనదేశమునం దంతకంతకు ప్రబలుచుండుట కనేక కారణము లగుపడు చున్నవి. కొందఱు తాము బ్రతికియుండఁగానే తమబిడ్డలకు వివాహము చేసి ముద్దులను ముచ్చటలను వేడుకలను చూడవలెనను నుద్దేశముతో పసిబిడ్డలకు వివాహములు చేయుదురు; మఱికొందఱు బిడ్డలయొక్క పెండ్లిండ్లను తామెప్పుడు చూతుమా యని తొందరపడుచుండెడు వృద్ధులయినజనకులయొక్కయు బంధువులయొక్కయు నిర్బంధముచేత చేయుదురు; కొందఱగవుతగవుల నిమిత్తమును కట్నములు కానుకలు మొదలైనవాని నిమిత్తమును పోరుపెట్టెడు మూఢురాండ్రయిన భార్యలయొక్క ప్రోత్సాహముచేత చేయుదురు; కొందఱు దంభమునకయి యతివ్యయము చేసి దక్షిణలచేతను బ్రాహ్మణసంతర్పణములచేతను ప్రతిష్ఠ పొందవలె నన్నకోరికతో చేయుదురు; కొందఱు వివాహములో వివాహము చేసిన సొమ్ము కలిసివచ్చునని చేయుదురు; మఱికొందఱిప్పటియాచారమునుబట్టి తమబిడ్డల కెంతశీఘ్రముగా వివాహము చేసిన లోకులు తమ్మంత మంచివా రనుకొందు రని పేరున కాశపడి చేయుదురు; కొందఱు కోడండ్రమీఁద నధికారము చేయవచ్చు నన్న యభిలాషతో నుండెడియిల్లాండ్రయొక్క యభిమతములు తీర్చుటకయి చేయుదురు; కొందఱు మంచిసంబంధముల కాశపడి చేయుదురు; కొందఱు వేగిరము వివాహములు కాకపోయినపక్షమున తమబిడ్డలు చెడిపోదురను సచ్చింతతోనే చేయుదురు; ఇంకను కొందఱు బాల్యవివాహములు చేయకుండుట శాస్త్రవిరుద్ధ మన్నభ్రమచేత చేయుదురు. ఈతెగలవారు గాక స్వప్రయోజనపరులై మానుషధర్మమును విడిచి దయాశూన్యులై రొక్కమును పుచ్చుకొనియో, అల్లుఁడు చచ్చి

నవో వానిసొత్తంతయు తమకే వచ్చుననియో, అల్లునియింటఁ జేరి తామందఱును సుఖజీవనము చేయవచ్చుననియో, తాముకన్న నోరెఱుఁగనిశిశువులను అప్రయోజకులకును వికలాంగులకును వృద్ధులకును వివాహవ్యాజమున బలియిత్తురు. ఏకారణములచేత జరిగెడుబాల్యవివాహముల కైనను పురోహితులును యాజకులును తోడుపడ సర్వవిధముల బాల్యవివాహములను ప్రోత్సాహపఱుతురు. ఇటువంటి కార్యములచేతనే ధనము సంపాదించి పొట్ట పోసికోవలసినస్వప్రయోజనపరులు ప్రోత్సాహము చేయక మఱి యేమి చేయుదురు? ఎవరి ప్రోత్సాహముచేత చేసినను, ఏయుద్దేశముతో చేసినను, ఏకారణముచేతఁ జేసినను, స్వభావవిరుద్ధ మనఁజను బాల్యవివాహము వలనఁ గలిగెడి దుర్వారము లైన దుష్ఫలములు కలుగక మానవు అతిబాల్యవివాహమువలన సంభవించుచున్న యనర్థములలోఁ గొన్నిటినిమాత్ర మిందు వివరించెదను. బాలారిష్టములును స్ఫోటకము మొదలగు సాంక్రామిక రోగములును వానివలన కలిగెడు మరణములును బాల్యదశయందే విస్తారముగా నుండునన్న సంగతి యెల్లవారికిని తెలిసినదే. అందుచేత ౧౮౯౧ వ సంవత్సరాంతమునందు మన దేశమునందు చేసిన జనపరిగణనమును బట్టి చూడఁగా తొమ్మిది సంవత్సరములకు లోపలి వయస్సుగలిగి వివాహమన్న నేమో యెఱుఁగనిదశలోనున్న బాలురలో భార్యలను పోగొట్టుకొన్నవారు లెక్క తెలిసినంతవఱకు ౨౮౨౨౩ గురు కనఁబడుచున్నారు. వీరి వివాహసమయములయందు వ్యయపఱిచిన ధనమంతయు వ్యర్థ మగుటతప్ప, ఈ బాలురుగాని వారి బంధువులుగాని యేమిలాభము ననుభవించినవారయినారు? బాలికలగతి బాలురదానికంటెను సహస్రగుణములు దుఃఖబహుళ మయినదిగా నున్నది. పురుషులు మరల వివాహము చేసికొనన నైన నర్హులుగా నుందురు గాని నిరపరాధిను లయిన పసిబా

లికల కామాత్రపు పుణ్యమునయినను లేక క్రూరమయి చిరకాలాగతమయిన యొకదురాచారప్రాబల్యముచేత నోరెఱుఁగని దశలో తల్లిదండ్రులుతమవేడుకకొఱకువివాహమని పేరుపెట్టి యొకతంతునడపినదోషమునుబట్టి యావజ్జీవమును ప్రపంచసుఖములకు దూరురాండ్రై మరణమునకంటెను తీవ్రవేదనాకరమయిన దుస్సహవైధవ్యబాధ ననుభవింప నిర్బంధింపఁబడుచున్నారు. అప్పటి జనపరిగణనమును బట్టి యిట్టి దుస్స్థితిపాలయి యున్న పసిబాలికలు మనదేశమునందెందఱున్నారో యాలోచింపుఁడు. ఆసంవత్సరమున తొమ్మిది యేండ్లకు లోఁబడిన వయస్సు గలవారయి భర్తలని చెప్పఁబడిన పురుషులను పోఁగొట్టుకొన్న దురదృష్టతను వహించిన దయనీయ లయిన బాలికలు ౭౮౯౭౯-గు రుండిరి. ధనము వ్యయముచేసి యీ పసిబాలికలకు వృథాగా తఱుగని దుఃఖమును గొని తెచ్చిపెట్టుకొనుటకుఁ గాక వీరి వివాహమువలన నెవరి కేవిధమయిన లాభము కలిగినది? ఈచెప్పినవారుగాక యీసంవత్సరమున పదునాలుగు సంవత్సరముల ప్రాయమునకు లోపుగా నున్న ౨,౦౭,౩౮౮గురు బాలికలుకూడ విధవలయి యుండిరి. ఈమూడులక్షల బాలికలును తలిదండ్రులచేతను సంరక్షకులచేతను బాల్యవివాహ మను పెనుభూతమునకు నిష్కారణముగా బలి పెట్టబడి కలకాలమును దుఃఖపరంపరపాలు చేయఁబడినవారేకదా? మన దేశమునందలి వైధవ్యదుఃఖమున కంతకును బాల్యవివాహమే ప్రధానకారణము కాకపోయినను ఇన్ని లక్షలబాలికల వైధవ్యమున కయినను కారణమయినందుకు లేశమాత్రమును సందేహములేదు. ఇఁక వైధవ్యమును పొందక తిన్నగా నున్నవారిగతి విచారింపుఁడు. వివాహమునాటికి చక్కఁగానున్న పురుషులుగాని స్త్రీలుగాని పలువురు స్ఫోటకము మొదలయినవ్యాధులచేత కన్నును కాలును చెడియు, వికలాంగు లయియు, దుర్బలశరీరు లయియు,

సంసారసుఖమునకు పనికిరాక యొండొరులకు దుఃఖహేతువు లగు-
చున్నారు. కొన్నిసమయములయందు యోగ్యు లయినపురుషుల
క యోగ్యురాండ్రు భార్య లగుట లభించియు, గుణవంతురాం డ్రయిన
స్త్రీలకు గుణహీనులు భర్త లగుట లభించియు, పరస్పరాంగీకారము
లేక పోవుటచేత మనసు కలియకయు, భర్తకంటె ముందుగా భార్య
యెదిగి కాపురమునకు వచ్చియు, దంపతులలో నొకరు విద్యావంతు
లయిన నొకరు మూర్ఖశిరోమణులుగా నుండఁ దటస్థించియు, బహు
దంపతు లేకగృహమున వసించుచుండియు సుఖ మన్నమాట యెఱుఁ
గనివా రగుచున్నారు. పెద్దపెరిగినతరువాతఁగాని సుగుణములో
దుర్గుణములో తిన్నగా స్థిరపడవు గనుక చిన్నతనములో వివాహము
నాటికి మంచివా రనుకొన్నవారే కొందఱు తరువాత చెడ్డవా రయి
మరికొన్ని దాంపత్యములు దుఃఖదాయకము లగుచున్నవి. బాల్య
వివాహప్రభావముచేత జనకు లన్న పేరు చెఱుప నవతరించిన మనుష్య
రూపముననున్న ఘోరరాక్షసులు ధనాశాపాశబద్ధులై తమ ముద్దు
బాలికలను వృద్ధవిగ్రహములకును వారికంటెను అధము లయిన
రోగిష్ఠులు మొదలయినవారికిని విక్రయించుచుండుటవలన ఆముద్దురాం
డ్రీడేరి కాపురమునకు వచ్చునప్పటికి పతులు స్వర్గయాత్ర కున్ముఖులై
యుండియు జీవచ్ఛవములవలె నుండియు యువతులు పలువురు దుఃఖ
ములపాలు కావలసినవా రగుచున్నారు. ఇంతేకాక మనదేశములో
నున్న యనేకవర్ణభేదములచేతను వానిలోని మితిమీఱినశాఖోపశాఖల
చేతను తల్లిదండ్రులు వేఱుగతి లేక రంభవంటికొమార్తె నైనను
కొన్నిసమయములయందు వికలాంగున కయినను దరిద్రున కయినను
ఇచ్చి వివాహము చేయవలసినవా రగుటచేత కొందఱుకన్నియలు
సుఖ మెఱుఁగనివా రగుచున్నారు.

ఇట్టి దేమియులేక సుఖ మనుభవింపుచున్నా రనుకొనుచున్న

బహుదంపతుల యవస్థను చూడుడు. ఒక్క మనదేశమునందు తప్ప సమస్తదేశములయందును పురుషులు తాము స్వతంత్రముగా భార్యాపుత్రులనుపోషింప శక్తివచ్చిన తరువాతనే వివాహము చేసికొందురు. మనదేశమునందట్లుగాక తల్లిదండ్రులుపసిబిడ్డలకే వారియనుమతివిచారింపక భార్యల సంటకట్టుటచేత మనబాలురు కౌమారదశయందలి స్వతంత్రవర్తనమును సంతోషమును చవిచూడనివారయి సదా నిరుత్సాహులగుచున్నారు. కాబట్టియే యొకహూణపండితుఁడొక పాఠశాలయందుపన్యసించుచు అన్నిదేశములవారికిని కౌమారదశ యుండఁగా మనపెద్దలు మనబాలుర కొకదశ నపహరించి జనసామాన్యమునకు భగవంతుఁ డనుగ్రహించియున్న యత్యంతప్రయోజనకర మయిన కౌమారదశానిక్షేపము తక్కువ చేసి యున్నారని వచించియున్నాఁడు. అందుకు సందేహము లేదు. ఈకౌమారదశయందే పురుషులు తమప్రవర్తనమును స్థిరపరుచుకొని, సుగుణసంపదను గడించి, విద్యాబుద్ధులయందు ప్రబలి, ధైర్యసాహసాదులను నేర్చుకొని, స్వతంత్రవృత్తినలవరుచుకొని, తరువాతి లౌకికయాత్ర కనుకూలమయిన సాధనసామగ్రినెల్లను సంపాదించుకోవలసినది. దుఃఖములు నెఱుఁగక నిర్విచారముగా నుండవలసిన యటువంటిసుఖకాలములోనే యాఁబోతునకు గుదెకఱ్ఱ కట్టినట్లు మనవారు బాలురకు సంసారము నంటకట్టి తల యెత్తుకొనకుండఁ జేయుటవలన మనవారుత్సాహమును ధైర్యసాహసాదులును లేనివారయి పూనికతో స్వతంత్రించి యేసత్కార్యమును జేయుటకును పనికిమాలినవారగుచున్నారు. అందుచేతనే మనబాలురు సాధారణముగా వివాహములేక పాఠశాలలో చదువుకొన్నంతవఱకును దేశోపకారము నిమిత్తము పాటుపడవలెననియు, సంఘదురాచారమును మాన్పవలెననియుఁ స్త్రీలయొక్కయు నీచకులమువారియొక్కయు స్థితిని బాగుచేయవలెననియు, తలఁచి మిక్కిలి యుత్సా

హముతో సమాజము లేర్పరచి ప్రసంగములు చేసి ధైర్యముతో దురాచారములను దూషింపఁ గలిగియు, వివాహమై భార్యకాపురమునకు వచ్చిన రెండుమూడు సంవత్సరములలోపలనే తమ పూర్వావస్థ నంతను మఱచిపోయి త్రొంటియుత్సాహముచెడి దీనముఖములు గలవారయి, దేశాభిమాన మన్నమాటను స్మరణకు తెచ్చుకోనక, త్రొంటిప్రసంగములను సమాజములను విడిచిపెట్టి, ధైర్యసాహసములను స్వాతంత్ర్యమును కోలుపోయి, ఎవ్వరియడుగులకు మడుగులొత్తి యైనను ఎన్ని యిచ్చకము లాడియైనను నెలకు పదియేనురూపాయలపని సంపాదించి లంచములుపుచ్చుకొనియో కల్లలాడియో తమ భార్యాపుత్రులను పోషించుటయే పరమార్థమని సిద్ధాంతము నేర్పఱుచుకొని, లోకము నిమిత్తమయి పాటుపడఁదలఁచినవారిని జూచి పరిహసించుచు వారిని నిరుత్సాహపఱచి, తాము లోకమునకు నిష్ప్రయోజకు లగుచున్నారు. పురుషులగతి యిట్లుండఁగా వారిభార్యలకింకొకదురవస్థకూడ ప్రాప్తించుచున్నది. ఆచిన్నది మగనికొలువుమాత్రమేకాక అత్తగారికొలువుకూడ చేయవలసి యుండును. సాధారణముగా మగఁడింటఁ గూరుచుండి సుఖభోజనము చేయుచుండు పరాధీనుఁడుగా నుండుటచేతను, తన్నుమాత్రమేకాక తనభర్తను కూడ పోషింపవలసినవారత్తమామలే యగుటచేతను, అత్తమామలకుఁ బూర్ణముగా కోపమువచ్చినపక్షమున ఇంట నిలుచుటయే పొసఁగనేరదు గనుకను, బాలభార్య మగనికంటె అత్తమామలకే యెక్కువలోఁబడి వారికే యాజ్ఞానువర్తినిగా నుండవలసిన దగుచున్నది. ఈహేతువునుబట్టి బాలభార్యలుపలువురు మగలమనసులకెడయై యావజ్జీవమును సుఖ మెఱుఁగనివా రగుచున్నారు. అదిగాక అత్తలకు కొందఱకు కారణ మున్నను లేకపోయినను కూడ కోడండ్రను బాధించునప్పటి కంటె నధికసంతోషము మఱియెప్పుడును కలుగదు.

అత్తగా రెంతమూర్ఖురా లయిన, ఈబాధ యంతయధికముగా నుండును. కొడు కేమైననుసరే కోడలిత్రాడు కోటిపల్లెరేవున త్రెంచినఁ జాలు నని సంతోషించు అత్తలును మనదేశములో పలువురున్నారు. ఈబాధలనుబట్టియే "అత్తపోఁగొట్టిన దడుగోటికుండ, కోడలుపోఁగొట్టినది క్రొత్తకుండ" యనుసామెతయు, ఇటువంటివే మఱికొన్నిసామెతలును వెలసి యున్నవి.

ఈసుఖ మంతయు నిట్లుండఁగా నీ బాలదంపతులకు లభించెడి యితరావస్థలను చిత్తగింపుఁడు. కాలము రాకమునుపె గర్భాధానమగుటచే కలిగినసంతానము సాధారణముగా దుర్బల మయి పురిటిలో పోవువారును తరువాత కొంతకాల మాదంపతులకును బంధువులకును శ్రమ యిచ్చి పోవువారును అయి యుందురు; అంతటిభాగ్యమును వహింపక చిరకాలము కష్టముల ననుభవించుచు బ్రతుక నోచుకొన్న బిడ్డలు చిడుము మొదలయిన వ్యాధులచేత చిక్కి దుర్బలమయిన శుష్కదేహములు గలవారయి పెద్దవారయినప్పుడుసహిత మాబిడ్డలకు పుట్టినబిడ్డలు తాము తమకాలములో పురాణములయందు వర్ణింపఁబడిన యంగుష్ఠమాత్రశరీరులను పుట్టింపఁ బ్రయత్నించుచున్నవారివలె నుందురు. ఆడుకోవలసినయవస్థలోనే బాలికలకు బిడ్డలు పుట్టుటచేత కూడ తల్లులు తిన్నగా పిల్లలను పెంచుటకు చేతఁగాక వారిని పాడు చేయుచున్నారు. బిడ్డలమాట యటుండఁగా బిడ్డలను గన్నతల్లులు తండ్రులు సహితము కొంతకాలములోనే శరీరపటుత్వము చెడి పడుచుతనములోనేముసలివారయి యల్పాయుష్కు లగుచుందురు. రజస్వలయయినంతమాత్రముచేత కన్య సంభోగార్హురాలు గాదనియు, సమస్తావయవపరిపూర్తి యగుటకు మఱికొన్నిసంవత్సరములు జరగవలెననియు, ఈలోపల వధూవరులను కలిపినయెడల వారిదేహములు చెడి రోగాశ్రయము లగుటయేకాక వారికి పుట్టినబిడ్డలును చెడుదు

రనియు వైద్యశాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు. ఈవిధముగా బాల్యవివాహమువలన సుఖము కలుగకపోవుటయేకాక వివాహము లేనియెడల దృఢకాయులయి చిరకాలము జీవింపఁదగిన దంపతులయాయువుకూడ సన్నమగుచున్నది. మఱియు బాల్యవివాహమువలన బాలికయొక్క చదువుమాత్రమే కాక బాలపుత్రుయొక్క చదువుకూడ చెడిపోవుచున్నది. సంసారదుఃఖములు లేక స్వేచ్ఛగా బ్రతుకవలసిన బాల్యదశలోనే సంసారమువచ్చి మీఁదపడుటచేత చదువుకోఁచక, ఇంట నొకమూల తల్లిదండ్రులును మఱియొకమూల నాలుబిడ్డలును ద్రవ్యార్జనము కుటుంబభరణము చేయుమని నిత్యమును పోరుచుండఁగానుద్యోగము నిమిత్తమయి యీబాలుఁడు కృషిచేయువలసినవాఁడుకాక యెటుండఁ గలఁడు? మన మెఱిఁగినవారిలోనే యెందఱు బాలురు మిక్కిలి తెలివిగలవారయ్యును గొప్పపరీక్షలం గృతార్థులయి యున్నతస్థితికి రాఁదగిన బుద్ధిసంపద గలవారయ్యును సంసారభారము మీఁదపడుటచేత నడుమ చదువు విడిచిపెట్టి భావిమహాఫలములను చెడగొట్టుకోవలసినవా రగుచున్నారు కారు? ఎందఱు బాలురు తమ చిన్నభార్యల నింట నొంటిగా విడిచి రా వలనుపడక యత్యల్పదూరములో నున్న శాస్త్రపాఠశాలలకు సహితము పోయి చదువుకో లేక చదువునం దెంత యాసక్తిగలవారయినను కార్యము లేక చిన్నపనులతోనే తృప్తి పొందవలసినవా రగుచున్నారు కారు? ఒక్క విద్యాభివృద్ధిమాత్రమే కాక సమస్తాభివృద్ధులకును బాల్యవివాహము ప్రతిబంధకముగా నున్నది. వివాహ మైనతోడనే తరుచుగా బాలికలను పాఠశాలలనుండి మాన్పించుచున్నారు. ఇదిగాక యీబాల్యవివాహమువలన చిన్నతనములోనే సంతానము గలిగి వారు పోషింపలేనియవస్థలోనే కుటుంబములు పెరుగుచుండుటచేతను వారి వివాహములనిమిత్తమయి కులాచారానుసారముగా విశేషవిత్తమును

వ్యయము చేయవలసి వచ్చుటచేతను మనదేశములో బహుకుటుంబములు పేదఱికముపాలయి పిమ్మట ఋణములపాలయి చిరకష్టములపాలు కావలసిన వగుచున్నవి. కొన్నిచోట్ల వివాహములనిమిత్తము చేసినయప్పులచేత పురుషులు తమకంతకు మునుపు జీవనాధారములుగానున్న మాన్యములను పోఁగొట్టుకొన్నవా రయి భార్య లింటికి కాపురమునకు వచ్చునప్పటికి తిండికి లేక తిరిపె మెత్తుకోవలసినస్థితిని పొందుచున్నారు. మఱికొన్నిచోట్ల వారి వివాహములనిమిత్తమయి చేసిన ఋణములను వారి ముమ్మనుమలును వారి సంతతివారునుకూడ తీర్చుకోవలసినవా రగుచున్నారు. పనికిమాలిన బాల్యవివాహములకయి దుర్వ్యయము చేయుటకంటె, ఆధనములో కొంతభాగము పెట్టి బాలురకు విద్య చెప్పించినపక్షమున వా రెంతసుఖపడుదురు? మనవారు బహ్వనర్థములకు మూలమయినయీబాల్యవివాహమును మానిపించి యేల తమబిడ్డల సుఖాభివృద్ధి చేయ బ్రయత్నింపరాదు? ముసలివాండ్ర వేడుకకొఱకు కడుపున పుట్టినబిడ్డలను పాడుచేయుట మానుషధర్మ మగునా? తమ కంత వేడుక చూడవలెనన్న మనసున్నపక్షమున బొమ్మలపెండ్లిండ్లు చేయించి సుఖ మనుభవింపరాదా? అంతటితో తృప్తి కలుగక పోయినయెడల నిజముగా బిడ్డలనే పల్లకులలోపెట్టి యూరేగించి సంతోషమనుభవింపరాదా? "ఎలుకకు ప్రాణసంకటము పిల్లికి చెల్లాటము" నన్నట్లు ముసలివాండ్రయొక్కయు మూర్ఖులయొక్కయు వినోదముకొఱకు పసిబాలికలయొక్కయు బాలురయొక్కయు సుఖము చెడఁగొట్టుట క్రూరకృత్యము కాదా? తల్లియొక్క యగవుతగవులనిమిత్తమును వేడుకలనిమిత్తమును బిడ్డలకు వివాహము చేయుటయు, వానివలన కలిగెడుకీడుల నాబిడ్డ లనుభవింపవలె ననుటయు నెంత కానిపని?

ఈబాల్యవివాహములు మనదేశములో చిరకాలమునుండియు

న్నను, ఇప్పు డంతకంతకు ప్రబల మగుచున్నవి. నాచిన్నతనములో
ఏడెనిమిది సంవత్సరములకు లోపు వయస్సుగలబాలికలకు వివాహము
చేయుట ఎక్కడనో యరుదుగానుండుచు వచ్చెను. ఇప్పుడు పాలు
విడువని బాలికలకుసహితము వివాహములు చేయుట సర్వసామాన్య
మగుచున్నది. ఈదురాచార మొక్క పామరులలో మాత్రమేకాక
చదువుకొన్నవారిలో కూడ వ్యాపించుచున్నది. ఇక్కడి విద్యాశాల
యందు సర్వకలాశాలాపరీక్షకు చదువుకొనుచు బహుధైర్యముతో
బాల్యవివాహము లనర్థదాయకములని వాదించుచువచ్చిననామిత్రుఁడే
యొకఁడు తనవంతు వచ్చినప్పుడు కొమార్తెకు నాలుగుసంవత్సరముల
యీడు వచ్చులోపలనే వివాహము చేయఁగా చూచి యున్నాను.
చదువుకొన్న వారికిని, చదువుకొననివారికిని మాటలయందు తప్ప
కార్యములయం దంతగా భేద మగపడుచుండ లేదు. ఈనడుమను
చెన్నపురమునందు జరిగిన మహాసభలో సర్వకలాపరీక్షలం దేటి
పట్టపరీక్ష నిచ్చి మెప్పించినంత మహావిద్యావంతులు కూడ తమ
కొమార్తెలకు పదిసంవత్సరములకు లోపల వివాహము చేయకుండు
టకు బద్ధుల మయ్యెదమని వాగ్దానము చేయలేకపోయిరి. వారందుకు
కనఁబఱిచిన హేతుబలమును కొంచెము చిత్తగింపుఁడు. ఈకొమార్తె
లను గన్నతండ్రులు తామే తల్లిదండ్రులచాటు బిడ్డలఁట! స్వాతం
త్ర్యము లేనివా రఁట! ఉన్నను తల్లిదండ్రులమనస్సులను నొప్పింప
నిష్టము లేనివారఁట! ఆహా! లోకములో నింతకంటె బానిసతన
మేమున్నది? వివాహవిషయమయిన సాధకబాధకముల నాలోచించు
కొను స్వాతంత్ర్యము వివాహసంబంధము వలని సుఖదుఃఖములను
యావజ్జీవమును అనుభవింప వలసిన వధూవరులకును లేక, వారి తల్లి
దండ్రులకును లేక, అంతలపొంతలవారికా యుండవలసినది? పట్ట
పరీక్షలం గృతార్థులైనవారు తాము స్వతంత్రముగా పొట్టపోసికోలే

మను భయముచేతనా తా మయుక్తమని యెఱింగినదియు తాము ప్రేమించెడివారికి నష్ట కరమయినదియు నైన యకార్యమును చేయ వలసినది! తమ కడుపున పుట్టినవారి సౌఖ్యాభివృద్ధితో చేరిన యీవిష యమునందే స్వాతంత్ర్యము లేకపోయినయెడల మఱియేవిషయము నందుఁ గలుగును? కారణము లేనివిషయములలో న్యాయము కాని కట్టుకట్టి కాటికి కాళ్ళుచాచుకొని యున్నవృద్ధు లయినజననీజనకుల మనస్సును నొప్పింపలేనంత దయార్ద్రహృదయముగలవారు, కల కాలము సుఖముగా బ్రతుకవలె నని కొండంత యాశ పెట్టుకొని దయనీయులయి తమకడుపునపుట్టిన ముక్కుపచ్చలారని ముద్దుకూఁతు లను వేగిరపడి స్వయంకృతాపరాధమువలన యావజ్జీవమును దుఃఖ ములపాలు చేయఁగలరా? ఈరీతి సాకులను విడిచిపెట్టి మనలోని చదువుకొన్నవారు తాము మంచికార్యమని దృఢముగా నమ్మిన దానిని పామరులకు భయపడక నిశ్శంకముగా నెప్పుడు చేయ నారం భింతురో, అప్పుడే మనదేశము బాగుపడ నారంభించునుగాని క్రియ లేని శూన్యవచనములచేత నెప్పుడును బాగుపడదు. "చదువవేసిన నున్న మతియుచెడిన" దన్నట్టు మనదేశమున చదువు హెచ్చుటతోనే బాల్యవివాహములును హెచ్చుచున్నవి. పూర్వకాలమునందు బ్రాహ్మ ణులు కానివారు కన్నులు తెఱువని పసికూనలకు వివాహము చేయు చుండుట సాధారణముగా లేదు. ఈకాలమున మూఁడేండ్లకు ముండ మోసిన బాలికలుగూడ శూద్రులలో కనఁబడుచున్నారు. ఇప్పుడు నష్టకరములని యెంచి బ్రాహ్మణులు తమ యాచారములను కొన్ని టిని మానుకొన ప్రయత్నించుచుండఁగా లాభనష్టములను కొంచె మయినను విచారింపక శూద్రులు మొదలయినవారు కొందఱు బ్రాహ్మణు లాచరించినట్టు తా మాచరించినచో తమకు గౌరవము వచ్చునని యెంచుకొని యనాలోచితముగా బ్రాహ్మణుల దురాచార

ములను కొన్నిటి నవలంబించుచున్నారు. అందుచేత పూర్వకాలము నందు బ్రాహ్మణ వైశ్యజాతులలో మాత్రమే యున్న బాల్యవివాహము లిప్పుడు సర్వవర్ణసామాన్యములయి శూద్రులలో కూడ వెలయుచున్నవి. శూద్రులు చేయనారంభించిన పనినే తామును చేయుచున్నచో తమకు గౌరవాధిక్యము లేదనుకొని యాలోచనలేని బ్రాహ్మణోత్తములు తా మేలాగున నయినను వారిని మించవలెనని యొకరు ప్రయత్నించుచుండుటచేత కడపట నందఱును చెడుచున్నారు. అందుచేత నీవివాహములు క్రమక్రమముగా వివేకులకుఁ బరిహాసపాత్రములయి, పెండ్లిపీటమీఁద పెండ్లికొడుకు తల్లిని గానక యేడ్చుచుటయు, పెండ్లికూఁతురు పాలకై యేడుచుచుటయు, వారి నేడుపుడుపుటకయి కొన్నిసమయములయందు బెత్తము చేతఁ బట్టుకొని యయ్యవారును మఱికొన్నిసమయములయందు పప్పు బెల్లములును కావలసివచ్చుటయు, భార్య యెవ్వరో తెలియక పిల్లనోడిలోఁ బెట్టుకొని చన్ను గుడుపుచున్న తల్లి మెడకే పెండ్లికొడుకు మంగళసూత్రధారణము చేయుటయు, పోరుపెట్టిన పెండ్లికొడుకుచేత పుస్తె కట్టించుటకు చేతఁగాక పురోహితుఁడే పెండ్లికొమార్తెకు తాళిబొట్టు కట్టి వివాహతంత్రము నడుపుటయు, దటస్థించుచున్నది. మాఘము లనియు శూన్యమాసము లనియు, పయిసంవత్సరము లగ్నములు లేవనియు, చెప్పి యనగ్రహించెడి జ్యోతిష్కులముహూర్తములు కూడ బాల్యవివాహములను త్వర పెట్టుచున్నవి. ఈజ్యోతిషముచేత జనులు మోహపడి జాతకపత్రిక బాగుండలేదను హేతువుచేత కులములో దొరక తగిన వారిలో కూడ మంచిమంచి వరులను నిరాకరించి యధములను స్వీకరించుచున్నారు. ఇందుచేతకూడ బహుదాంపత్యములు సుఖదాయకములు కాకున్నవి ఈముహూర్తములవలన జ్యోతిషమునే వృత్తిగా నేర్పఱచుకొన్న వారి కుటుంబపోషణము జరుగుచుండుట తప్ప నాకు

వేఱు ప్రయోజన మగుపడుచుండ లేదు. తక్కిన యే శుభకార్యముల కెట్లు చేసినను వివాహకార్యమునందు మాత్రము వరుని జాతకపత్రమును పరిశీలింపించికొనువారును మంచిముహూర్తమును పెట్టించుకొనువారును సాధారణముగా నుండరు. అట్లయినను ముహూర్తమును పెట్టించుకొనని హూణులు మొదలయినవారిలో కన్న సుముహూర్తములు కని కాలమును ధనమును వెచ్చపెట్టెడు హిందువులలోని విధవ లధికముగానున్నారు. జ్యోతిషమువలన ప్రయోజనలేశమయినను కలిగినయెడల శుభలగ్నములయందు వివాహిత లయినవారిలో నిన్ని లక్షలమంది బాలవిధవ లెందుచేత కావలయునా యని నాకు సందేహము కలుగుచున్నది. ఇట్టి సందేహమే మనవారి కందఱికిని కలిగెడుపక్షమున, ముహూర్త మృత్యుదేవతనోటినుండి విధవలు కాకుండ ప్రతిసంవత్సరమును లక్షలకొలఁది పసిబాలికలను కాపాడ వచ్చు నని నాకు తోఁచుచున్నది. అది యట్లుండ నిండు.

మనవారిప్పుడు సామాన్యముగా బ్రాహ్మణవర్ణమునకు, హిందూశాస్త్రములు బాల్యవివాహములు విధించుచున్న వనియు, శాస్త్రవిధానము దుర్లంఘ్యమనియు భావించుచున్నారు. అట్టివారికి సంశయనివారణము కలుగుటకయి నాకుఁ దెలిసినంతవఱకు వివాహ విషయమునఁ గల శాస్త్రమునుకూడ సంగ్రహముగా వివరింతుచున్నాను. వేదమంత్రములును మంత్రవినియోజకవాక్యము లయిన కల్పసూత్రములును సంబంధించి యున్నంతవఱకును, బాల్యవివాహముల కనుజ్ఞ యెక్కడను లేదు సరిగదా, వ్యక్తురాలయిన కన్యకే వివాహము చేయవలసినట్టుకూడ కనఁబడుచున్నది.

వివాహమంత్రములలోని "సోమః ప్రథమో వివిదే గంధర్వో వివిద ఉత్తరః తృతీయో అగ్నిష్టే స్తురీయస్తే మనుష్యజాః ॥ సోమో దద ద్గంధర్వాయ గంధర్వో దద దగ్నయే । రయించ పుత్రాం

శ్చాదాదగ్ని ర్మహ్యమథో ఇమాం॥" అను ఋగ్వేద వచనమునుబట్టి కన్నియను మొదట సోముఁడు వరించుననియు, తరువాత గంధర్వుఁడు వరించుననియు, అటుపిమ్మట నగ్ని వరించుననియు, ఆపయిని మనుష్యుఁడు వరించు ననియు, కన్నియను సోమాదు లొకరితరువాత నొకరి కియ్యఁగా కడపట మనుష్యునకు వచ్చుననియు, శాస్త్రమర్యాద యున్నది. కన్నియను పురుషుఁడు వివాహ మాడుటకుముందు సోమాది దేవతలు వరించవలసిన పక్షమున, ఆసోమాదులు వరించెడికాలమేది, అటుతరువాత మనుష్యుఁడు పొందవలసినకాలమేది, అవి తెలిసికో వలసియుండును. దీనికాధారముగా సంవర్తస్మృతియందు 'శ్లో॥ రోమ దర్శన సంప్రాప్తే సోమో భుఙ్క్తేథ కన్యకాం। రజోదృష్ట్వాతుగంధర్వఃకుచౌదృష్ట్వాతుపావకః॥" అని యథారోమదర్శన కాలమందుసోముఁడునురజోదర్శనకాలమునందు గంధర్వుఁడును కుచదర్శన కాలమునందు పావకుఁడును వరింతురనియు, అటుపిమ్మట ననఁగాకన్నియయు క్తవయస్సు వచ్చి రజస్వలయయి కుచపరిపూర్తి యయినపిమ్మట నేపురుషుఁడువివాహ మాడవలయుననియు, ప్రమాణవచనము కనఁబడుచున్నది. దీనినిబట్టి చూడఁగా నీడేఱనివారిని వివాహ మాడకూడదనియేకదా స్పష్టమగుచున్నది. రోమదర్శనాది కాలములయందు సోమాదులు వరింతురనఁగా వా రా కాలములయందు వరుసగా శరీర శుచిత్వమును, వాక్చాతుర్యమును, పరిశుద్ధతను కలుగఁజేయుదురని తాత్పర్యమే కాని వారు నిజముగా వరింతురనియే యర్థము కాదు. అందుచేతనే యాజ్ఞవల్క్యస్మృతియందు "శ్లో॥ సోమ శ్శౌచం దదౌ స్త్రీణాం గంధర్వశ్చ శుభాంగిరం। పావకస్సర్వమేధ్యత్వం మేధ్యావై యోషితో హ్యతః॥" అని స్త్రీలకు సోముఁడు శౌచమునిచ్చుననియు, గంధర్వుఁడు మంచి పలుకులనిచ్చుననియు, పావకుఁడు సర్వపరిశుద్ధతలనిచ్చు ననియు, కంఠోక్తిగాఁ జెప్పబడియున్నది. ఈ శ్లోకములోని కడపటి చరణమునకు

వ్యాఖ్యానముచేయుచు విజ్ఞానేశ్వరయోగి "స్త్రియస్సర్వత్ర స్పర్శనాలింగనాదిషు శుద్ధాః" అని వ్రాసియున్నాఁడు. కాఁబట్టి స్త్రీలు వివాహకాలమునకు సంపూర్ణావయవములు కలవారయి యీడేటి వాక్ప్రౌఢిమ కలవారయి యుండవలెనని యేర్పడుచున్నది. శ్రుతిస్మృతులయందీప్రకారముగా నుండఁగా బాల్యవివాహములను వ్యాపింపఁజేసినవారు జ్యోతిర్నిబంధమను గ్రంథములోని దని "శ్లో॥ షడబ్దమధ్యే నోద్వాహ్యా కన్యా వర్షద్వయంయతః। సోమోభుఙ్క్తే తత స్తద్వద్గంధర్వశ్చ తథానలః॥" అని స్త్రీ కాఱేండ్లలోపల వివాహము చేయఁగూడదనియు, సోమగంధర్వపావకులు రెండేసి సంవత్సరము లనుభవింతురనియు వ్రాసి, సోమాదు లనుభవించుకాల మాఱేండ్లలోనే పోవుననియు నేడవయేఁడు మొదలుకొనియే కన్నియ వివాహయోగ్యురాలనియు బోధపడునట్లు చేసియున్నారు. కాని సోమాదులు కన్నియను పసితనములోనే వరించి శౌచాదుల నిత్తురనుట యుక్తికిని శాస్త్రమునకునుకూడ విరుద్ధము. గంధర్వుని నుద్వాహము చేయునప్పుడు వివాహములో పఠించెడు ఋగ్వేదమంత్రముతోనే "ఉదీర్ష్వాతో విశ్వావసో నమసేడా మహేత్వా। అన్యామిచ్ఛ ప్రఫర్వ్యగ్ంసంజాయాం పత్యా సృజ। ఉదీర్ష్వాతః పతివతీహ్యేషా విశ్వావసుం నమసా గీర్భి రీట్టే। అన్యామిచ్ఛపితృషదం వ్యక్తాగ్ంసతే భాగో జనుషాతస్యవిద్ధి" అని గంధర్వుఁడయిన విశ్వావసుఁడు వివాహితయయిన యాస్త్రీని విడిచిపెట్టి వ్యక్తురాలు కాని పితృగృహముననున్న యవివాహితకన్య యొద్దకు పోవ ప్రార్థింపఁబడుచున్నాఁడు. ఇట్టి బలవత్తరమయిన శ్రుతి ప్రమాణముండఁగా నిర్ణయసింధువునం దుదాహరింపఁబడిన పయివచనమునుబట్టి కన్నియకు నాలవయేటనే స్తనోద్గమము కలుగుననికాని, యేడవయేటనే వివాహము చేయవలెననికాని, వివేకు లెవ్వరయిన చెప్పసాహసింపఁగలరా?

అంతేకాక వివాహములో నాలవదినమున వధూవరులకు జరిగెడి సంభాషణములో "అపశ్యం త్వా మనసా చేకితానం తపసో జాతం తపసో విభూతం। ఇహప్రజా మిహరయిగ్ంరరాణః ప్రజయా స్వప్రజయాపుత్రకామ" అని వరునిగూర్చి వధువు 'నీవు యోగ్యుఁడవు,యు తపసుచేత పుట్టి తపస్సుచేత వర్ధిల్లితివనియు నేను మనస్సుచేత తెలిసికొంటిని గనుక, నాయందు పుత్రకాముఁడవయి యున్న నీవిఁక సంతోషపూర్వకముగా సంతానము పొందుమనియు, "అపశ్యం త్వా మనసాదీధ్యానాగ్ం స్వాయాం తనూగ్ం ఋత్వియేనాధమానాం। ఉపమాముచ్చా యువతిర్బభూయాః ప్రజయాత్వ ప్రజయాపుత్రకామే" అని వధువునుగూర్చి వరుఁడు 'నీవీసమయమునందు నాధునితో కూడవలె నని యపేక్షించుచున్నట్టు నామనస్సుచేత కనిపెట్టితిని గనుక, యువతివయి పుత్రకామురాలవయి యున్న నీవు నన్ను పొంది సంతానము కనుము' అనియు, మంత్రములచేత చెప్పుదురు. ఇటువంటి సంభాషణము సంభోగముమాట యటుండఁగా వివాహమనఁగా నేమో యెఱుఁగని బాలునకును బాలికకును జరిగెడి దని మతిమంతుఁ డెవ్వఁ డయిన చెప్పగలుగునా? వివాహ దినముల లోనే వరుఁడు వధువునుగూర్చి "గృహాం గచ్ఛ గృహపత్నీ యథా సోవశినీ త్వం విదథమావ దాసి" అను ఋగ్వేదమంత్రముచేత 'నీవు గృహమునకువచ్చి గృహయజమానురాల వయి యింటికి వచ్చిన వారి నాదరించి గృహకృత్యములను నిర్వహింపు' మని పలుకుటయు, వధువునుగూర్చి బ్రాహ్మణులు "ఇహప్రియం ప్రజయా తే సమృధ్యతా స్మిన్ గృహే గార్హపత్యా యజాగృహి। ఏనాపత్యాతన్వగ్ం సంసృజ స్వాథాజి ప్రివిదథమావదాథః" అను ఋగ్వేదవచనముచేత 'ఇప్పుడు ప్రియాపడి నీ వీగృహమునందు సంతానమును పొంది గృహ యజమానత్వము నందు జాగరూకురాల వయి, నీశరీరమును నీపతి

శరీరముతో చేర్చి మీరు ముసలివా రగువఱకును గృహమును పరామర్శింపుము' అనిపలుకుటయు, బాల్యవివాహమున కిసుమంతయయినను ప్రసంగి యుండునా? ఆపస్తంబ, ఆశ్వలాయనాది సూత్రము లన్నియు వధూవరులు మూడుదినము లధశ్శయ్యనుండి బ్రహ్మచర్యము చేయవలెననియు నాలవదినము రాత్రి గర్భాధానము జరగవలె ననియు విధించుచున్నట్టును, గర్భాధానముతోగాని వివాహపూర్తి కానట్టును శాస్త్రజ్ఞానము కలవారి కందరికిని తెలియునుగదా? ఇప్పుడు జరుగుచున్న శాస్త్రవిరుద్ధ మయినబాల్యవివాహములలో వివాహమున కావశ్యకమయిన గర్భాధానమును జరపకపోయినను మన పురోహితులు నాలవనాటిరాత్రి గర్భాధానమంత్రముల నేకరువు పెట్టుచుండుట నందఱు నెఱుగుదురుగదా? ప్రాచీనము లయిన మన ధర్మశాస్త్రము లన్నియు యుక్తవయస్సు వచ్చిన స్త్రీలకే వివాహమును విధించుచున్నవి. అందుచేతనే మన ధర్మశాస్త్రకర్తలు వివాహయోగ్యకన్యాప్రాశస్త్యమును చెప్పునప్పుడు "శ్లో॥ కన్యాక్షతయోనిః స్యాత్కులీనా పితృమాతృతః। బ్రహ్మాదిషు వివాహేషు పరిణీతా యథావిధి॥ సా ప్రశస్తా వరారోహా శుద్ధయోనిః ప్రశస్యతే" అని బ్రాహ్మాది వివాహములయందు కులీనురాలును పురుషసంభోగ మెఱుగనిదియు ప్రశస్తురా లని వృద్ధగౌతముఁడును, "గృహస్థో వినీతక్రోధహర్షో గురుణానుజ్ఞాతః స్నాత్వా అసమానార్షా మస్పృష్టమైథునాం యవీయసీం సదృశీం భార్యాం విందేత" అని వరుఁడు గురువుయాజ్ఞ పొంది పురుషసంసర్గ మెఱుఁగని తనకంటె చిన్నదానిని వివాహ మాడవలయునని వసిష్ఠుఁడును, "శ్లో॥ అసపిండాచ యా మాతు రసగోత్రాచ యా పితుః। సా ద్విజానాం ప్రశస్తా స్త్రీ దారకర్మణ్యమైథునీ" ద్విజాతులలో మైథున మెఱుఁగని స్త్రీ భార్యగా స్వీకరించుటకు ప్రశస్తురాలని మనువును, బ్రాహ్మ్యాదివివాహములయందు పురుషసంభోగము లేని కన్నియలనే

ప్రశస్తతరాంద్రసనుగాఁ జెప్పియున్నారు; రజస్వలలు కానివారికే ద్విజాతులలో వివాహములు జరగవలెనని యీ ఋష్యాదు లుద్దేశించి యుండినయెడల, వా రుపయోగించిన అక్షతయోని, శుద్ధయోని, అస్పృష్టమైథునా, అమైథునా, అను పదము లన్నియు వ్యర్థములగును గదా? ఇది యిటుండఁగా మనువు మొదలగువారు వ్యక్తురాండ్రైన స్త్రీలకు వివాహములు విధించియున్నారు. "శ్లో॥ త్రీణివర్షాణ్యపేక్షేత కుమార్యృతుమతీసతీ । ఊర్ధ్వంతుకాలాదేతస్మాద్విందేత సదృశంపతిం॥ అదీయమాన భర్తార మధిగచ్ఛే ద్యది స్వయమ్ । నైనఃకించిదవాప్నోతి నచయం సాధిగచ్ఛతి॥" అని కుమారి ఋతుమతి యైనతరువాత మూఁడు సంవత్సరములు వేచియుండి, తండ్రి వివాహము చేయని యెడల స్వయముగానే వరుని కోరుకోవచ్చు ననియు, ఆప్రకారముగా వరించిన స్త్రీ గాని దాని భర్త గాని యేవిధ మయిన పాపమును పొందరనియు, మనువు స్పష్టముగాఁ జెప్పియున్నాఁడు. "త్రీణి వర్షా ణ్యృతుమతీ కాంక్షేత పితృశాసనమ్ । తత శ్చతుర్థే వర్షే తు విందేత సదృశం పతిమ్॥" ఋతుమతి యైనస్త్రీ మూడు సంవత్సరములు తండ్రి యాజ్ఞకయి వేచియుండి నాలవ సంవత్సరమున తగినభర్తను కోరుకోవలసినదని బోధాయనులు చెప్పియున్నారు. "ఋతుత్రయ ముపాస్యైవ కన్యాకుర్యాత్స్వయంవరమ్" అని మూడుఋతువు లైనతరువాత కన్య స్వయముగానే వరింపవచ్చునని విష్ణుస్మృతియందును జెప్పఁబడి యున్నది. ఇట్లు వీరందఱును ఋతుమతి యైనతరువాత వివాహము నంగీకరించుటయేకాక, మంచి వరుఁడు దొరకని పక్షమున నెంతికాలమయినను కన్యను వివాహము లేకనే యుంచవచ్చుననికూడ మన్వాదులు విధించి యున్నారు. "శ్లో॥ కామమామరణాత్తిష్ఠే ద్గృహేకన్యర్తుమత్యపి । నత్వేవైనాం ప్రయచ్ఛేత గుణహీనాయ కర్హిచిత్॥" అని కన్య ఋతుమతి యైనను

మరణపర్యంతమును గృహముననే యుంచవలసినదికాని గుణహీనున కెన్నఁడును నియ్యఁగూడదని మనువును "దద్యాద్గుణవతే కన్యాం నగ్నికాం బ్రహ్మచారిణే। అపివా గుణహీనాయ నోపరుంధ్యాద్రజస్వలామ్॥" అని కన్యను గుణవంతుఁడయిన బ్రహచారి కియ్యవలసినదేకాని రజస్వలనైనను గుణహీనుని కియ్యఁగూడదని బోధాయనులును, మఱికొందఱు ఋషులును చెప్పియున్నారు. ఇట్లు చెప్పినను రజస్వలయైన కన్యను వివాహములేక చిరకాల మింటనుంచిన పక్షమున చోరరతియు దానిఫలములైన భ్రూణహత్యాదులును సంభవింపవచ్చునని యెంచి కొందఱు ఋషులు రజస్వలయైన దానిని శీఘ్రముగా వివాహము చెయ్యనిపక్షమున పాపము వచ్చునని చెప్పియున్నారు. "శ్లో॥ ప్రాప్తే ద్వాదశమే వర్షే యః కన్యాం నప్రయచ్ఛతి। మాసిమాసి రజస్తస్యాః పితా పిబతి శోణితమ్॥" పండ్రెండవ సంవత్సరము వచ్చినతరువాత తండ్రి కన్యకకు వివాహము చేయని పక్షమున, ప్రతిమాసమునందును నాచిన్నదాని ఋతురక్తమును పానము చేసినట్లని యమస్మృతియందును, ఇత్యాదివచనములు కొన్ని మఱికొన్ని చిల్లరస్మృతులయందును గానఁబడుచున్నవి. మన్వాదులు ధర్మకార్యమునిమిత్తమయి కొన్ని సమయములయందు మాత్రము కొంచెము బాల్యవివాహముల కనుజ్ఞ యిచ్చియున్నారు. "శ్లో॥ త్రింశద్వర్షోద్వహేత్కన్యాం హృద్యాం ద్వాదశవార్షికీమ్। ద్వ్యష్టవర్షోష్టవర్షోవా ధర్మే సీదతి సత్వరే॥" ధర్మమునకు గావలసినప్పుడు ముప్పదిసంవత్సరములవాఁడు పండ్రెండేఁడ్ల చిన్నదానిని పదునాఱుసంవత్సరములవాఁడు ఎనిమిదేండ్లదానిని వివాహ మాడవచ్చునని మనువు వ్రాసియున్నాఁడు. ఇట్టిస్థలములలోతప్ప సాధారణముగా బాల్యవివాహములు చేయకూడదు. బాల్యవివాహములు పూర్వకాలమునందు లేవుగనుకనే యత్రిస్మృతియందు "శ్లో॥ వివాహే వితతే యజ్ఞే

హోమకాల ఉపస్థితే । కన్యాం ఋతుమతీం దృష్ట్వా కథం కుర్వంతి యాజ్ఞికాః॥ స్నాపయిత్వాతు తాం కన్యా మర్చయిత్వా హుతాశనమ్ । యుంజానహోమం కుర్వీత తతః కర్మ ప్రయోజయేత్॥" అని కన్య వివాహమధ్యమున ఋతుమతి యైనపక్షమున స్నానములు మొదల యినవి చేయించి కర్మ జరపవలసినదని చెప్పఁబడి యున్నది. మన పురాణములయందు సహితము పూర్వకాలమునందు బాల్య వివాహ ములు జరిగిన ట్లెక్కడను విని యుండలేదు. "శ్లో॥ పితా దృష్ట్వా సుమంతోపి స్త్రీచిహ్నంయౌవనే స్థితాం। కస్మై దేయా కన్యేత్యచింత యదతీవ సః॥ మునిః కౌండిన్యనామా వైవాహేచ్ఛురథాగతః। తస్మై ప్రదేయా కన్యేతి సుమంత్తే నాపి నిశ్చితమ్॥" అని సుమంతుఁ డను బ్రాహ్మణుఁడు స్త్రీచిహ్నములు ధరించి యౌవనవతియై యున్న తన కొమార్తెను కౌండిన్యున కిచ్చినట్లును, ఇట్టి వివాహము లనేకములు జరుగుచుండినట్లును పురాణముల యందు పెక్కుచోట్ల కానఁబడు చున్నది.

ఇదిగాక మనపూర్వులు పురుషులలో బాల్యవివాహముల కవ కాశము లేకుండనే కట్టుదిట్టము లేర్పఱిచియున్నారు "శ్లో॥ గర్భా ష్టమేబ్దే కుర్వీత బ్రాహ్మణస్యోపనాయనమ్ । గర్భా దేకాదశే రాజ్ఞో గర్భాత్తు ద్వాదశేవిశః॥ ఆషోడశా ద్బ్రాహ్మణస్య సావిత్రీ నాతివర్త తే। ఆద్వావింశా త్క్షత్రబంధో రాచతుర్వింశతే ర్విశః॥" అను వచన ములనుబట్టి బ్రాహ్మణుల కేడవసంవత్సరము మొదలుకొని పదియా ఱవ సంవత్సరము లోపలను, క్షత్రియులకు పదవసంవత్సరము మొద లుకొని యిరువదిరెండవ సంవత్సరములోపలను, వైశ్యులకు పదునో కొండవ యేఁడు మొదలుకొని యిరువదినాల్గవ సంవత్సరము లోపలను ఉపనయనము జరుగవలసియున్నది. "శ్లో॥షట్త్రింశ దాబ్దికం చర్యం గురౌ త్రైవేదికం వ్రతమ్ । తదర్ధికంవా పాదంవా గ్రహణాంతికమే

వవా॥" అను మనువచనమునుబట్టి బ్రహ్మచర్యము చేయవలసిన
కాల మెప్పుడును తొమ్మిదిసంవత్సరములకు తక్కువ యుండదుగనుక,
ఎవ్వరికిని పదియారు సంవత్సరములలోపల వివాహ మాడుటకే వీలు
లేదు. ఇది యిట్లుండగా బాల్యవివాహమున కాధారముగా నేమి
ప్రమాణము లున్నవాయని యాలోచింపఁగా, "శ్లో॥ అష్టవర్షాభవేద్గౌరీ
నవవర్షాతురోహిణీ। దశవర్షా భవేత్కన్యా అత ఊర్ధ్వంరజస్వలా॥"
అన్న వచనముతప్ప మఱియేదియు కనఁబడదు. వివాహమంత్రము
లయందు కన్యాశబ్ద మగుపడుచుండుట చేతను స్మృతులయందుకూడ
కన్యాశబ్దమే తఱుచుగా కనఁబడుచుండుట చేతను, బాల్యవివాహము
ను నెలకొల్పనెంచిన వా రెవరో యీశ్లోకమును కల్పించి, కన్యాశబ్ద
మునకు విపరీతార్థ మిచ్చి స్వాభిమతము నెఱవేఱునట్లుగా నొక స్మృతి
యందు కలుపఁగా తక్కినవారును దానిని స్వీకరించి యుందురు. అట్లు
కానియెడల నీ సంకేతనామముల కేమిప్రయోజనము కలదు? వానికి
కొంచెము ప్రయోజన మగుపడునట్లుగా, "శ్లో॥ గౌరీందదన్నాకపృష్ఠం
వైకుంఠం రోహిణీం దదత్ । కన్యాం దద ద్బ్రహ్మలోకం రౌరవం తు
రజస్వలామ్॥" అని మఱియొకశ్లోకము కల్పింపఁబడినది. ఈ కడ
పటి శ్లోకమే లేకపోయినయెడల గౌరీ, రోహిణీ శబ్దములతోడ ప్రయో
జనమే యుండదు. కొన్ని స్మృతులయందు నగ్నికా శబ్దము కనబడు
చున్నందున దానినికూడ బాలికాపరముగా పర్యవసితము చేయుట
కయి "శ్లో॥ అష్టమేతుభవే ద్గౌరీ నవమేనగ్నికా భవేత్ । దశమే కన్య
కా ప్రోక్తా ద్వాదశే వృషలీ తథా॥" అని పయిదానికి విరుద్ధముగా
మఱియొక శ్లోకము కల్పింపబడినది. వివాహానుక్రమణిక యందు
"శ్లో॥ కన్యాం కనకసంపన్నాం కనకాభరణై ర్యుతాం। దాస్యామి
విష్ణవే తుభ్యం బ్రహ్మలోకజిగీషయా॥" అని కన్యాదాన మొక్కటి
యే చెప్పఁబడి యున్నది. కాని రోహిణీగౌరీదానము లెక్కడను

జెప్పఁబడి యుండలేదు. కన్యాశబ్దమునకు సాధారణముగా వివాహ ముకాని పడుచే యర్థ మయినను కొన్ని స్మృతులయందు "ఋతు స్నాతాతు శుద్ధా యా సా కన్యే త్యభిధీయతే" అని ఋతుస్నాతయే కన్యయనియు, అట్టి కన్యావివాహమే ముఖ్యము యనదనియు చెప్పఁబడి యున్నది. బ్రాహ్మణకన్యల కెనిమిదవయేట వివాహము చేయవలె నని యొకానొక చిల్లరస్మృతియందు ప్రక్షిప్త వచన మొకటి కానఁ బడుచున్నది. పయిని చెప్పిన శ్లోకములు ప్రక్షిప్తములు కాకపోయి నను, వానియందు సహితము పదిసంవత్సరములుదే కన్యయని చెప్పఁ బడియున్నది గనుక, నేను పయినిచూపిన బాధకములను చక్కఁగా విచారించి పదిసంవత్సరములకు లోపలనయినను బాలికకు వివాహము చేయక మనవారు జాగరూకు లయి యుందురని నమ్ముచున్నాను. ఇందులో ముఖ్యముగా చదువుకొన్నవారు తమచేత నయినంత ప్రి యత్నము చేసి తమయింట నతిబాల్యవివాహములు చేయకయు, తమ పలుకుబడి యున్నంతవఱకు చేయనీయక వారించియు, తెలియనివా రికి బాల్యవివాహమువలననష్టములను చెప్పియు, నుపన్యసించియు, ప్ర కటించియు, పాటుపడుదురని నమ్ముచున్నాను. మనలోని విద్యాధి కుల కిటువంటి సద్బుద్ధి నుదయింపఁ జేసి, శీఘ్రకాలములోనే యతిబాల్య వివాహములు మన దేశములో నామమాత్రావశేషము లగునట్లు ప్రసాదించి, ఈ భరతఖండమునకు పూర్వపుమంచిదశను మరల కలి గింప జగదీశ్వరుని ప్రార్థించుచున్నాను.